గ్యాస్ పైపులైన్‌కు మరమ్మతులు

మేడ్చల్: ఇంటింటికీ వంటగ్యాస్ సరఫరా చేసే పైపులైన్ లీక్ కావడంతో గ్యాస్ ఎగిసిపడింది. మేడ్చల్, కిష్టాపూర్ రోడ్డులో రోడ్డు పక్కన స్తంభం ఏర్పాటు చేయడానికి తవ్వుతుండగా.. అక్కడ ఉన్న గ్యాస్‌లైన్‌లో ఉన్న పైపు పగలడంతో ఒక్కసారిగా గ్యాస్ పైకొచ్చి ఎగిసిపడింది. స్థానికులు గ్యాస్ కంపెనీ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని పగిలిన పైప్‌ను సరిచేసి ప్రమాదాన్ని నివారించారు.

ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గం



జవహర్‌నగర్: కార్పొరేషన్ ఆర్యవైశ్య భవన్‌లో కాప్రా మండల ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ మేరకు సంఘం నూతన అధ్యక్షుడిగా పెద్ది మురళీకృష్ణను కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శ్రీనివాస్, అశోక్, గౌరీశంకర్, రవీందర్, నాగరాజు, తిరుమలేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రేపు కలెక్టరేట్‌లో సర్దార్ సర్వాయి పాపన్న జయంతి

సాక్షి,మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధిశాఖ అధ్వర్యంలో తూంకుంట మున్సిపాలిటీ పరిధిలోని అంతాయిపల్లి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం మీటింగ్ హాల్‌లో ఈనెల18న ఉదయం 10 గంటలకు సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు జిల్లా అధికారి టి.ఝాన్సీరాణి ప్రకటించారు. ప్రజా ప్రతినిధులు, గౌడ కులసంఘాల నాయకులు, వివిధ కులాల సంక్షేమ సంఘాల ప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలని..

18న రిలే నిరాహార దీక్ష

కీసర: అహ్మద్‌గూడ డబుల్‌బెడ్రూం ప్రాంతంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ ఈనెల 18 నుంచి రిలే నిరాహార దీక్షలు చేస్తున్నట్లు డబుల్ బెడ్రూం ఫేస్–1 కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు విజయ్‌కుమార్, షేక్‌లు శనివారం ఓ ప్రకటన ద్వారా తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డబుల్ బెడ్రూం ప్రాంతంలో సరైన సదుపాయాలు లేక లబ్ధిదారులు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులకు ఫిర్యాదు చేస్తే పట్టించుకోవడం లేదని, మరోవైపు విచారణ పేరుతో లబ్ధిదారులకు నోటీసులు జారీచేసి భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. డబుల్ బెడ్రూం నుంచి సికింద్రాబాద్ వరకు బస్సు సౌకర్యం కలిపించి సర్వీసులు పెంచాలని, అర్బన్ హెల్త్ సెంటర్, అంగన్‌వాడీ, రేషన్‌షాపులు, ప్రైమరీ స్కూళ్లను ఏర్పాటు చేయాలని వారు కోరారు.

వైద్యం అందక గర్భిణి మృతి

జవహర్‌నగర్: జవహర్‌నగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో సరైన వైద్యం అందక ఓ గర్భిణీ మృతి చెందిన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కార్మానాకు చెందిన శామలపల్లి నిఖిత (22) గర్భిణీ. కాగా ఆమెకు తీవ్ర రక్తస్రావం రావడంతో ఈనెల 15న జవహర్‌నగర్‌లోని లో ఆస్పత్రికి రావడంతో వైద్యులు రక్తం ఎక్కించి చికిత్స అందించి ఇంటికి పంపించారు. ఆమె ఆరోగ్యం క్షీణించి తీవ్ర రక్తస్రావం అవడంతో శనివారం ఉదయం అదే ఆసుపత్రికి తిరిగి తీసుకొచ్చారు. ఈ మేరకు వైద్యులు ఆమెకు చికిత్స అందిస్తుండగా.. అపస్మారక స్థితిలోకి వెళ్లింది. సీపీఆర్ చేసినా.. ఎలాంటి స్పందన లేకపోవడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిన నిఖిత మధ్యాహ్నం మృతి చెందిందని వైద్యులు ధ్రువీకరించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా వారు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆచూకీ లభ్యం

తల్లిదండ్రుల చెంతకు తప్పిపోయిన బాలుడు



అల్వాల్: తప్పిపోయిన బాలుడిని నేరేడ్‌మెట్ పోలీసులు తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్‌నగర్‌లో 11 ఏళ్ల బాలుడు తప్పిపోయి తిరుగుతుండగా.. స్థానికులు పోలీసులకు అప్పగించారు. సదరు బాలుడికి సరిగ్గా మాటలు రాకపోవడంతో అతడి తల్లిదండ్రుల వివరాలు తెలియరాలేదు. అనంతరం పెట్రోల్ వెహికల్ ఇన్‌చార్జ్ హెడ్ కానిస్టేబుల్ రామస్వామి బాలుడి ఫోటోతో స్థానికుల ద్వారా బాలుడి వివరాలు తెలుసుకుని ఏఎస్‌రావునగర్ భవానీనగర్‌కు చెందినట్లు గుర్తించి తల్లి మానికరెడ్డికి బాలుడిని అప్పగించారు. బాలుడిని అప్పగించిన పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఘట్‌కేసర్ వంతెన వద్ద రోడ్డు మధ్యే విద్యుత్ స్తంభం



గుంతలు.. చింతలు !

అడుగులోతు గుంతలతో ప్రయాణికుల అవస్థలు

వంతెనకు ఇరువైపుల నరకం చూపుతున్న రోడ్లు

పట్టించుకోని కాంట్రాక్టర్, సంబంధిత అధికారులు

ఘట్‌కేసర్: పట్టణంలోని అడుగు లోతు గుంతలకు మరమ్మతుల విషయంలో అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అడుగు లోతు గుంతలతో రోడ్లు అధ్వానంగా మారి ప్రయాణించాలంటేనే వాహనదారులు హడలెత్తిపోయే పరిస్థితి నెలకొంది. దీనిపై ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

కనీసం మరమ్మతులకు నోచుకోని వైనం..

మాధవరెడ్డి రైల్వేగేటు నుంచి బస్సు ప్రయాణ ప్రాంగణం నుంచి కీసర, కొండాపూర్, బోగారం అవుషాపూర్, భువనగిరిపై వైపు వెళ్లే రోడ్డు అధ్వారంగా తయారైంది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మరమ్మతులు చేపడితే ద్విచక్ర వాహనాలతో పాటు కార్లు, ఆటోలు ప్రయాణించే అవకాశం ఉంది.

రోడ్డు మధ్యే విద్యుత్ స్తంభం..

రోడ్డుకు మధ్యలో విద్యుత్ స్తంభాలు ఉండటంతో వరద నీటి కారణంగా విద్యుత్ షాక్ తగిలే ప్రమాదం ఉంది. కోర్టు కేసుల కారణంగా మరికొన్ని ఇళ్లు నేటికి కూల్చకపోవడంతో ప్రయాణానికి ఆటంకం కలుగుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయా ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు పట్టణంలోని వీధుల్లో ప్రయాణించలేక దూరం తక్కువ కావడం, తక్కువ సమయం పడుతుండటంతో చాలామంది ప్రయాణికులు ఈ దారిలో ప్రయాణిస్తుంటారు. రోడ్డుపై ఏర్పడిన గుంతలతో పాదచారులు సైతం నడవలేని పరిస్థితి నెలకొంది.



రైల్వే వంతెన వద్ద వాహనదారుల అవస్థలు

కుంటలను తలపిస్తున్న రోడ్లు..

వాహనాల తాకిడి పెరిగి వరద నీటితో రోడ్లు కుంటలను తలపిస్తున్నాయి. మరమ్మతులతో పాటు రోడ్డును విస్తరిస్తే సమస్యలు తప్పుతాయని ప్రయాణికులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డును విస్తరించి, గుంతలకు మరమ్మతులు చేపట్టి ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

ప్రభుత్వం స్పందించడం లేదు



వంతెనకు ఇరువైపుల ఉన్న రోడ్లపై ఏర్పడిన గుంతలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ప్రజల రాకపోకలకు రోడ్డు ఏర్పాటు చేయాలని దీక్షలు చేపట్టినా.. వినతులు ఇచ్చిన అధికారులు స్పందించం లేదు. రోడ్డు నిర్మాణంపై ప్రభుత్వానికి చలనం రావడం లేదు.

– బండారు ఆంజనేయులుగౌడ్, స్థానికుడు

రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి..



పట్టణంలోనుంచి కొండాపూర్‌కు వెళ్లాలంటే చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది. రైల్వేగేటు వద్ద వంతెనకు ఇరువైపుల గల రోడ్డుపై అడుగులోతు గుంతలు ఏర్పడ్డాయి. ప్రజల రాకపోకలకు వెంటనే మరమ్మతులు చేయించాలి.

– శ్రీకాంత్‌రెడ్డి, కొండాపూర్

ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు..



గుంతలతో నిత్యం వేలాది మంది ప్రజలు, వాహనదారుల ప్రయాణానికి అడ్డంకిగా మారింది. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా మరమ్మతులు చేయించాలి. రోడ్డు నిర్మాణంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు.

– హనుమాన్, స్థానికుడు

అభివృద్ధి పనులకు నిధులు కేటాయించండి



మంత్రి శ్రీధర్‌బాబుతో బొనగిరి సురేష్‌యాదవ్

మల్కాజిగిరి: రాష్ట్ర ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబును మల్కాజిగిరికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత, ఏసీసీసీ ఓబీసీ విభాగం మాజీ నాయకుడు బొనగిరి సురేష్‌యాదవ్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన మాట్లాడుతూ.. మేడ్చల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా శ్రీధర్‌బాబు ఉన్నారని, మల్కాజిగిరిలో ఉన్న పలు పెండింగ్ పనులకు నిధులు మంజూరు చేయాలని కోరానన్నారు. పరిశ్రమలు, వాణిజ్యశాఖలు కూడా ఆయన పరిధిలోనే ఉండటంతో నూతన పరిశ్రమల ఏర్పాటులో స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరినట్లు చెప్పారు.

ఉచిత వైద్య శిబిరం

మల్లాపూర్: రెడ్‌క్రాస్ సొసైటీ మేడ్చల్, మల్కాజ్‌గిరి జిల్లా బ్రాంచ్ ఆధ్వర్యంలో శనివారం మల్లాపూర్ ఈస్ట్ అన్నపూర్ణ కాలనీ కమ్యూనిటీహాల్‌లో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. సీనియర్ వయోవృద్ధులు, మహిళలకు వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్యులు శిఫా, నర్సు శాంతి, సీనియర్ సిటిజన్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు చౌదరి, కేశవరం ఆంజనేయులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికి వైద్య సేవలు అందాలి..

బోడుప్పల్: ప్రతి ఒక్కరికి వైద్య సేవలు అందాల్సిన అవసరం ఉందని చెంగిచర్ల 1వ డివిజన్ మాజీ కార్పొరేటర్ బింగి జంగయ్యయాదవ్ అన్నారు. శనివారం చెంగిచర్లలోని అరవింద ఎన్‌క్లేవ్‌లో కాలనీ అధ్యక్షులు చిన్న ముదిరాజ్, హ్యాండ్స్ ఆఫ్ మెర్సి మినిస్ట్రీస్ సంయుక్తాధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

నాలా ఆక్రమణల తొలగింపు !

అటుగా వెళ్తూ.. పరిస్థితిని సమీక్షించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్



అధికారులతో మాట్లాడుతున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

మేడ్చల్: జాతీయ రహదారిపై వరదనీరు వెళ్లే నాలా ఆక్రమణకు గురై నీరు రోడ్డుపైకి రావడంతో నాలా ఆక్రమణలు తొలగిస్తున్న మున్సిపల్ అధికారులను చూసి, అటుగా వెళ్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్ మేడ్చల్‌లో కారు దిగి పరిస్థితిని సమీక్షించారు. మేడ్చల్ పెద్ద చెరువు కట్టకింద చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం వద్ద జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేసిన ఓ వెంచర్ నిర్వాహకులు నాలా నుంచి నీరు వెళ్లకుండా ఆక్రమించి గోడ నిర్మించారు. దీంతో భారీ వర్షాలకు వరద నీరు రోడ్డుపై చేరడంతో గంటల తరబడి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. దీంతో పరిస్థితిని గుర్తించిన మున్సిపల్ కమిషనర్ చంద్రప్రకాష్‌రెడ్డి, ఏసీపీ శంకర్‌రెడ్డి, ట్రాఫిక్ పోలీసులు, మున్సిపల్ సిబ్బందితో కలిసి నాలా ఆక్రమణలను యంత్రాల సాయంతో తొలగిస్తుండగా.. ట్రాఫిక్ జామ్ అయ్యింది. అదే సమయంలో హైడ్రా కమిషనర్ నిజామాబాద్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్నారు. ట్రాఫిక్ సమస్యకు కారణమేమిటని.. ? వాహనం దిగి చూడగా.. నాలా ఆక్రమణల తొలగింపు కనబడటంతో అధికారుల వద్దకు వెళ్లారు. ఆక్రమణలను పూర్తిగా తొలగించాలన్నారు.

వెంచర్ నిర్వహకులకు ఆదేశాలు..

జాతీయ రహదారి వెంట మేడ్చల్ పరిధిలో ఏర్పాటైన వెంచర్ల యజమానులు తమ పత్రాలతో సోమవారం రావాలని ఆదేశించారు. రోడ్డు విస్తరణలో అనేక సందేహాలు ఉన్నాయని, ఎన్‌హెచ్ఎఐ అధికారులు సోమవారం తమ కార్యాలయానికి రావాలని కోరారు. మున్సిపల్ అధికారులు నాలా ఆక్రమణలు తొలగించి నీరు సాఫీగా వెళ్లేలా మరమ్మతులు చేసి అన్ని ఆక్రమణలు తొలగింపజేశారు.

గంజాయి స్వాధీనం



ఉప్పల్: ఉప్పల్‌లో భారీగా గంజాయిని ఎక్సైజ్ పోలీసులు మాటు వేసి పట్టుకున్నారు. ఈ ఘటన శనివారం ఉప్పల్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధి ఉప్పల్ భగాయత్‌లో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఓంకార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇద్దరు అనుమానితులు ఉప్పల్ భగాయత్‌లో అనుమానాస్పదంగా తిరుగుతుండగా.. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించారు. సంగారెడ్డి జిన్నారం ప్రాంతానికి చెందిన శివ, అదే గ్రామానికి చెందిన ముకేష్ కుమార్‌లు ఇద్దరు ఐడీఏ బొల్లారంలో నివాసం ఉంటున్నారు. ఒడిశా నుంచి కిలోకు రూ.3000 చొప్పున గంజాయిని ఆర్టీసీ బస్సుల్లో తీసుకొచ్చి నగరంలోని వివిధ ప్రాంతాల్లో అవసరమైన వారికి చిన్న చిన్న ప్యాకెట్లుగా చేసి విక్రయిస్తుంటారు. వీరి వద్ద నుంచి 1.120 కిలోల గంజాయితో పాటు రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించారు.

మాజీ ప్రధాని వాజ్‌పేయికి ఘన నివాళి

ఘట్‌కేసర్: పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో భారత మాజీ ప్రధాని, భారతరత్న వాజ్‌పేయి వర్ధంతిని బీజేపీ మున్సిపల్ శాఖ అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన దేశానికి అందించిన సేవలను గుర్తుచేసుకుని కొనియాడారు. మధుగౌడ్, మోహన్‌రావు, వీరేశం, అభిమన్యు, మధుసూదన్‌రెడ్డి, భానుప్రకాష్, పవన్ సింగ్, ప్రవీణ్, హర్ష పాల్గొన్నారు.

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లిలో బీజేపీ నేతలు వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులర్పించారు. బీజేపీ రాష్ట్ర నాయకులు విక్రమ్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ మోహన్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు శ్రీధర్, మాజీ కౌన్సిలర్ మల్లికార్జున్ ముదిరాజ్ నివాళులర్పించారు.



మేడ్చల్‌లో..

మేడ్చల్: పట్టణంలో భారత మాజీ ప్రధాని వాజ్‌పేయి విగ్రహం వద్ద బీజేపీ నేతలు ఘనంగా నివాళులర్పించారు. శైలజజగన్‌గౌడ్, శ్రీశైలంయాదవ్, మురళీధర్‌గుప్తా, ప్రేమ్‌దాస్, శ్రీకాంత్, అర్జున్, వంశీ, రాఘవరెడ్డి, రాజు పాల్గొన్నారు.



ఘట్‌కేసర్‌లో నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు



వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఉత్తమ విద్యార్థులకు నగదు పురస్కారం

ఒక్కొక్కరికీ రూ.10 వేలు అందజేత

సాక్షి,మేడ్చల్ జిల్లా: మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో 2024–25 సంవత్సరంలో పదోతరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ.10 వేల చొప్పున చెక్కులను జిల్లా కలెక్టర్ మనుచౌదరి అందజేశారు. రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు కలెక్టరేట్ ప్రాంగణంలో జిల్లాలో గతేడాది పదిలో అధిక మార్కులతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను కలెక్టర్ అభినందించారు. మూసాపేట్, జెడ్పీహెచ్ఎస్, (బాలికలు)కు చెందిన విద్యార్థులు జానం సోనీ (579 మార్కులు), చీకటి త్రివేణి (572 మార్కులు), సూరారం కాలనీకి చెందిన విద్యార్థి కుర్మ రాజ్‌కుమార్ (563 మార్కులు), మల్కాజిగిరికి చెందిన విద్యార్థి సాయి విఘ్నేష్ (561 మార్కులు) పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించారు. విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున మొత్తం రూ.40 వేల విలువైన చెక్కులను డీసీపీ కోటిరెడ్డి, అదనపు కలెక్టర్లు రాధికాగుప్తా, విజయేందర్‌రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారితో కలిసి జిల్లా కలెక్టర్ మనుచౌదరి అందజేశారు. భవిష్యత్తులో మరింత శ్రమించి ఉన్నత శిఖరాలకు ఎదిగేందుకు బాగా చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు.

ప్రజా సమస్యలను పట్టించుకోరూ.. !



మేడ్చల్‌లో రోడ్డును పరిశీలిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

మేడ్చల్: స్థానిక సంస్థల్లో నెలకొన్న సమస్యలను ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ అన్నారు. మేడ్చల్ మున్సిపాలిటీలో ఆయన స్థానిక డీవైఎఫ్ఐ నాయకులతో కలిసి పలు సమస్యలను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని అధికారులను కోరారు. నిధులు లేక సమస్యలు పరిష్కారం కాకపోవడంతో గ్రామాలు, పట్టణాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్యలపై డీవైఎఫ్ఐ నిరంతరం పోరాటం చేస్తూ.. వాటి పరిష్కారానికి కృషి చేస్తుందన్నారు. మేడ్చల్ మున్సిపల్ అధికారులు సమస్యలపై దృష్టిసారించి పరిష్కరించాలని కోరారు. నాయకులు నర్సింగ్‌రావు, శంకర్, ప్రశాంత్, బాలకిరణ్, నర్సింహ్మ, వెంకటేష్, ప్రశాంత్ తదితరులున్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్

మేడిపల్లి: బహిరంగ ప్రదేశంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసిన ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మేడిపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బోడుప్పల్‌లో నివాసం ఉంటున్న సంపత్‌కుమార్, బత్తిని అజయ్‌లు స్థానికంగా ఉన్న ఓ వైన్స్ షాపులో మద్యం సీసాలను కొనుగోలు చేసి అధిక ధరకు బహిరంగ ప్రదేశాల్లో అక్రమంగా విక్రయిస్తున్నట్లు పక్కా సమాచారం అందుకున్న మేడిపల్లి పోలీసులు శుక్రవారం రాత్రి ఆ ప్రదేశంపై దాడి చేసి మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 8 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కృష్ణం వందే జగద్గురుమ్ !



ఇస్కాన్‌లో ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణ

మేడ్చల్ జోన్ పరిధిలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. శనివారం ఇళ్లలో సంప్రదాయ బద్ధంగా ప్రత్యేక పూజలు నిర్వహించి తమ పిల్లలను రాధాకృష్ణులుగా అందంగా తయారు చేసి మురిసిపోయారు. భక్తులతో వైష్ణవాలయాలు కిటకిటలాడాయి. చిన్నారులు సాంస్కృతిక నృత్యాలతో సందడి చేశారు. 125 మంది శ్రీకృష్ణుడు, 100 మంది గోపికలతో నాగారంలో శోభాయాత్ర ఆకట్టుకుంది.

– మేడ్చల్ జోన్ బృందం







నాగారంలో శ్రీకృష్ణాష్టమి శోభాయాత్ర



చీర్యాల, నాగారం దేవాలయాల్లో..



జవహర్‌నగర్‌లో మల్లన్న యాదవ సంఘం సభ్యులు



ఘట్‌కేసర్‌లో మాజీ చైర్‌పర్సన్ పావని

